సాక్షి
వరంగల్

మంగళవారం । 20 । జూన్ । 2023



ఐటీఐ..చదువులో మేటి!
సాంకేతిక విద్యకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. వివిధ ఉద్యోగాలకు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఐటీఐలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. - 8లో▸



ఆర్టీసీ లాజిస్టిక్‌తో సత్వర సేవలు
ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీస్‌తో సత్వర సేవలు అందుతున్నాయని ఆర్టీసీ కరీంనగర్ జోన్ లాజిస్టిక్ ఇన్‌చార్జ్ భానుకిరణ్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41°/28°

వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గణాంకాలు సమగ్రంగా ఉండాలి



నల్లబెల్లి: అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ గణాంకాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గణంకాధికారి ఉషా అన్నారు. నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సోమవారం సందర్శించారు. వర్షమాపకం పనితీరు, పలు రికార్డులను పరిశీలించారు. మండల గణాంక అధికారులు రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ దూలం మంజుల, మండల గణాంక అధికారి అనిల్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో టీచింగ్ పోస్టులను పార్ట్ టైం పద్ధతిలో బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సమ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం, ఎంఎస్సీ, ఎంఏ, ఎంకాం, బీఈడీ అభ్యర్థులు ఈనెల 22వ తేదీలోపు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పర్వతగిరిలో దరఖాస్తులు అందజేయాలన్నారు. డెమో 24వ తేదీ ఉదయం 10 గంటలకు టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ వరంగల్ ఈస్ట్ నాయుడు పెట్రోల్ పంపు నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాయపర్తి జేఎల్ కెమిస్ట్రీ, పీజీటీ మ్యాథ్స్, నర్సంపేట జేఎల్ ఇంగ్లిష్, టీజీటీ బయో సైన్స్, హిందీ, దుగ్గొండి జేఎల్ బయోలాజీ, పర్వతగిరి సోషల్ స్టడీస్‌లో ఖాళీలు ఉన్నాయన్నారు. వివరాలకు 9704550192 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కేజీబీవీల్లో..

కాశోజీ సెంటర్: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) స్పెషల్ ఆఫీసర్, పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల (యూఆర్‌సీ)లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీల ఖాళీలను తాత్కాలిక కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 5 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ వాసంతి తెలిపారు. కేజీబీవీలో ఖాళీల భర్తీకి కేవలం మహిళా అభ్యర్థులే అర్హులన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.స్కూల్‌ఎడ్యు.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో జూలై 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్హతలు, రాత పరీక్ష, అభ్యర్థుల ఎంపిక విధానం తదితర వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని డీఈఓ సూచించారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట



నల్లబెల్లి: వర్షాలు కురవాలని నల్లబెల్లి మండలం కొండాయిల్‌పల్లిలో సోమవారం కప్పతల్లి ఆట ఆడారు. యువత, మహిళలు గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ కప్పతల్లికి జలాభిషేకం చేస్తూ ప్రత్యేక పూజలు చేశారు. వానలు కురవాలని వేడుకున్నారు.

22న జాబ్ మేళా

కాశోజీ సెంటర్: జిల్లాలోని నిరుద్యోగ యువతులకు ప్రైవేట్ కంపెనీలో ఉపాధి కల్పించేందుకు ఈనెల 22న నగరంలోని ములుగు రోడ్డు ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.మాధవి తెలిపారు. రిలయన్స్, నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా హనుమకొండలో పనిచేసేందుకు దాదాపు 20 ఉద్యోగాల ఎంపికకు ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 30 నుంచి 45 సంవత్సరాల వయస్సుగల ఏదైనా డిగ్రీ చదివిన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 7799314685 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'ఇన్‌స్పైర్ అవార్డు మనక్' నామినేషన్ల స్వీకరణ

కాశోజీ సెంటర్: ఇన్‌స్పైర్ అవార్డు మనక్ -2023-24 విద్యాసంవత్సరానికి ఈ-మేనేజ్‌మెంట్ ద్వారా ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్లు ఆగస్టు 31 తేదీ లోపు నమోదు చేసుకోవాలని డీఈఓ డి.వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలకు వేదిక ఇన్‌స్పైర్ అవార్డు మనక్ అని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్ అవార్డ్స్.డీటీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో స్కూల్ అథారిటీ ద్వారా ప్రతీ పాఠశాల నుంచి ఐదు ఉత్తమ ఆలోచనలు నామినేట్ చేయాలన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో సైన్స్, టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు.

మట్టి దందా!

యథేచ్ఛగా మట్టి, ఇసుక అక్రమ రవాణా
- ప్రమాదకరంగా మారుతున్న గుంతలు
- ఇబ్బందులు పడుతున్న స్థానిక రైతులు
- పట్టించుకోని అధికారులు



సంగెపు వాగులో ఏర్పడిన గుంతలు

వర్ధన్నపేట: పట్టణంలో నల్ల మట్టి, ఇసుక దందా జోరుగా సాగుతుంది. అది ప్రభుత్వ భూమి అయినా.. ప్రైవేట్ భూమి అయినా.. మట్టి అక్రమ రవాణాదారుల కంట పడిందంటే అంతే.. రాత్రికి రాత్రే జేసీబీలతో మట్టిని తరలించి లక్షలు జేబులేసుకుంటున్నారు. ఇదంతా సంబంధిత శాఖల అధికారులైన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పైగా చెరువుల్లోని మట్టిని సైతం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా వర్ధన్నపేట పట్టణంలోని సంగెపు వాగు పరిసరాల్లో మట్టిని తవ్వి అడుగున ఉన్న ఇసుకను ఫిల్టర్ చేసి అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా రైతులకు సంకటంగా మారింది. సంగెపు వాగులో ఎక్కడ పడితే అక్కడ 10 నుంచి 15 అడుగుల లోతు గుంతలు తవ్వి మట్టిని, ఇసుకను అక్రమ రవాణా చేస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నిత్యం వాగు వెంట రైతులు, పశువులు వెళుతుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తవ్వకాలపై స్థానిక రెవెన్యూ అధికారులకు రైతులు ఫిర్యాదు చేయడంతో ఇటీవల ఆయా గుంతలను అధికారులు పరిశీలించారు. అయినా బాధ్యులపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. వర్షాకాలం వరద నీరు వచ్చినప్పుడు గుంతల్లో నీరు నిండి లోతు తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. దీంతో పాటు ఇష్టారాజ్యంగా ఇసుకను తోడటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైన అక్రమ మట్టి, ఇసుక రవాణాదారులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా మట్టి అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ రవాణాను నియంత్రించాలి



మా పంట పొలాల వెంట ఉన్న సంగెపు వాగులో పెద్ద పెద్ద గుంతలు తవ్వి మట్టిని, ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో పంటపొలాలు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. పశువులు, రైతులు ఆ గుంతల్లో పడే ప్రమాదం ఉంది. అక్రమ రవాణాదారులను నియంత్రించి రైతులకు న్యాయం చేయాలి.
– ఓర్సు ఎల్లస్వామి, రైతు, వర్ధన్నపేట

ఆదర్శ మున్సిపాలిటీగా నర్సంపేట

- దశాబ్ది ఉత్సవాల్లో అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు

నర్సంపేట: నర్సంపేట పట్టణం ప్రకృతికి నిలయంగా విలసిల్లుతోంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో పచ్చదనం పరుచుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, కమిషనర్ వెంకటస్వామి పర్యవేక్షణలో పట్టణ ప్రకృతి వనాలతో ఆహ్లాదకర వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంతో శభాష్ మున్సి'పాలన' అనిపించుకుంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితహారంలో తెలంగాణలో ఆదర్శ మున్సిపాలిటీగా నిలిచింది. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. గత హరితహారం కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, కమిషనర్ వెంకటస్వామి ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. మహబూబాబాద్ రోడ్డు, ఫ్రీడం పార్కు, టేకువనం, కాకతీయనగర్, నెక్కొండ రోడ్డులో, సంజీవని ఆశ్రమం వద్ద, మున్సిపల్ పార్కుతో పాటు పలు చోట్ల ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ పరిధిలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేకంగా వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ఎండాకాలంలోనూ నర్సరీలు, ప్రకృతి వనాల్లో మొక్కలు వాడిపోకుండా ఉండేందుకు బోర్లు వేయించి నీటి సౌకర్యానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంలో సఫలీకృతులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నర్సంపేట: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు, మేధావులపై యూపీఏ చట్టం కింద 152 మందిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో 152 మందిపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో గత రెండు సంవత్సరాల క్రితం కరోనా కాటుకు బలైన వారి పేర్లు ఉండడం పోలీసుల అత్యుత్సాహానికి నిదర్శనమన్నారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యక్కతోపాటు ఇతర ప్రజా సంఘాల నాయకులు, మేధావులపై అక్రమ కుట్ర కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా నాయకులు గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి, భోగి సారంగపాణి, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సురేష్, నాయకులు బొమ్మెర బిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.పులక్క, ఎల్లక్క, ఏఐకేఎంఎస్ డివిజన్ నాయకులు భీమగాని మల్లన్న, చిన్నాల మల్లేష్, దుండగుల సంపత్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు

రాయపర్తి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యతని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని మైలారం గ్రామంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ హరితోత్సవం కార్యక్రమాలను నిర్వహించగా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి మొక్కలను నాటారు.అనంతరం గ్రామంలోని రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటు చేసిన తెలంగాణ దశాబ్ది సంపద వనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సంపత్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అష్రఫ్‌పాషా, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా దినోత్సవం

కాశోజీ సెంటర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు విద్యా దినోత్సవం నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి తెలిపారు. నగరంలోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3 గంటలకు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెట్లతోనే జీవరాశి మనుగడ సాధ్యం



ఖానాపురం: అటవీ రక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది, అధికారులు



వర్ధన్నపేట: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

- ఎమ్మెల్యేలు పెద్ది, అరూరి

ఖానాపురం: చెట్ల పెంపకంతోనే జీవరాశికి మనుగడ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఖానాపురం మండలంలోని పాకాల బీట్ పరిధిలో గల పులిచేరుకుంట సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా అశోక్‌నగర్ శివారులో ఫారెస్ట్‌శాఖ ఆధ్వర్యంలో నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించి పాకాల బీట్–1 పరిధిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాకాల బీట్–2 పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పెద్ది మాట్లాడారు. చెట్లు లేకుంటే జీవితాలు నాశనం అవుతాయని, హరితహారం కార్యక్రమం ద్వారా 7.70 శాతం విస్తీర్ణం పెరిగిందన్నారు. హరితత్సోవం కార్యక్రమం సందర్భంగా చేపట్టిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ నాగభూషణం, ఆర్డీఓ శ్రీనివాసులు, ఫ్లోర్‌లీడర్ స్వప్న, ఎంపీపీ ప్రకాశ్‌రావు, ఏసీపీ సంపత్‌రావు, సీఐ సూర్యప్రసాద్, ఎఫ్‌ఆర్వో రమేష్, వెంకటస్వామి, సుమణవాణి, ఉమారాణి, ప్రవీణ్‌కుమార్, గౌరైె కవిత, డీఆర్వో మోహన్, ఎఫ్‌ఎస్‌ఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. కాగా దట్టమైన పాకాల అటవీ ప్రాంతంలో హరితోత్సవాన్ని నిర్వహించడంతో పలువురు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

హరిత తెలంగాణగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే: ఎమ్మెల్యే అరూరి

వర్ధన్నపేట: రాష్ట్రంలో అటవీ శాతాన్ని పెంచాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి దానిని విజయవంతం చేసి హరిత తెలంగాణగా తీర్చి దిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం కార్యక్రమాన్ని మండలంలోని కట్ర్యాల గ్రామంలో చేపట్టగా ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భవిష్యతరాలకు చక్కని వాతావరణం అందించాలనే సంకల్పంతో హరితహారం రూపకల్పన చేసి దానిని తూచా తప్పకుండా అమలు చేసి విజయవంతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ప్రకృతిని కాపాడాలి

- సీఎండీ గోపాల్‌రావు



కాపులకనిపర్తి సబ్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న సీఎండీ గోపాల్‌రావు

సంగెం: సమాజంలోని ప్రతిఒక్కరు మొక్కలు నాటి సంరక్షించి పకృతిని కాపాడాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంగెం మండలంలోని కాపులకనిపర్తి సబ్‌స్టేషన్‌లో హరితహారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ ఆవరణలో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు ఇతరులకు ఆదర్శంగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కొత్తగా వచ్చిన వ్యవసాయ కనెక్షన్లు తక్షణమే ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ మధుసూదన్, డీఈలు భిక్షపతి, మల్లికార్జున్, ఆనందం, ఏడీఈ నరసింహరావు, ఏఈలు తిరుపతిరెడ్డి, మధుసూదన్, సంపత్‌రెడ్డి, రాజశేఖర్, సబ్‌ఇంజనీర్లు క్రాంతి, తాజుద్దీన్, సురేష్, సాల్మన్ సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పులో విందు రాజకీయం!

- సొంత పార్టీ నేతల ప్రాపకం కోసం ఎమ్మెల్యే నరేందర్ అగచాట్లు
- అందరూ నా వాళ్లేనని, ప్రత్యామ్నాయం లేదనే సంకేతాలకు యత్నం
- ఎన్నికల వరకు ఎవరూ చేజారకుండా ఉండేందుకే ప్రయత్నాలు
- ఇద్దరు కార్పొరేటర్ల గైర్హాజరు.. మరికొందరు దూరమయ్యే చాన్స్
- ఇంకోవైపు 'మందికే టికెట్లు...ఇంటోని కెందుకు'అనే వ్యాఖ్యల దుమారం
- మమ్మల్ని మంది అంటారా అని ముఖ్య నేతల మండిపాటు



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పులో మంత్రి కేటీఆర్ పర్యటన తర్వాత రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ఇన్నాళ్లు ఇక్కడ వన్‌మ్యాన్ షోను తలపించిన గులాబీ పార్టీలో అనుకొని విందులు, కలలో కూడా అనుకొని అతిథులకు ఇస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. గతంలో కొందరు కార్పొరేటర్లు ఎమ్మెల్యే వ్యవహారశైలిపై అసంతృప్తితో జట్టుగా ఏర్పడి పార్టీ మారే ప్రయత్నం చేస్తున్నారని పలుమార్లు చర్చల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే అప్పుడు ఎమ్మెల్యే పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవన్న ప్రచారం ఉంది. తాజాగా కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పది మంది అధికార పార్టీ కార్పొరేటర్లు తనకు టచ్‌లో ఉన్నారని చెప్పడం, అప్పటికే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడంపై మంత్రి కేటీఆర్ నుంచి భరోసా రాకపోవడంతో స్థానిక నేతలను బుజ్జగించే పనిలో ఉన్నారని పొలిటికల్ సర్కిల్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇన్నాళ్లు కనుసైగతో కార్పొరేటర్లను అన్నివిధాలుగా కట్టడి చేసిన సదరు నేత...ఇప్పుడు ఆత్మరక్షణలో పడి వారి ప్రాపకం కోసం దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారన్న టాక్ ఉంది. వీరందరి మద్దతు తనకే ఉందని చెప్పడం ద్వారా అధిష్టానం వద్ద ముఖ్యంగా సీఎం వద్ద మార్కులు కొట్టేసి తిరిగి టికెట్ తెచ్చుకునే వ్యూహాలను అమలు చేస్తున్నారన్న ప్రచారం వినిపిస్తోంది. ఇందులో భాగంగానే బీఆర్‌ఎస్ బహిరంగసభ విజయవంతం చేశారని మహిళా కార్పొరేటర్ల భర్తలు, కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులకు ఆదివారం రాత్రి వరంగల్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఖరీదైన మందుతో విందు ఇవ్వడం హాట్‌టాపిక్‌గా మారింది. మహిళా కార్పొరేటర్లు కూడా హాజరై భోజనం చేసినట్టుగా ప్రచారం ఉంది. ఎన్నికల వరకు ఎవరూ చేజారకుండా ఉండేందుకే ఈ విందు ఇచ్చారని తెలుస్తోంది. ఏదిఏమైనా ఇన్నాళ్లు గ్రూప్ రాజకీయాలు చేసి కొందరిని పార్టీ నుంచి బయటకు పంపడం ద్వారా తనకు తిరుగులేదనుకున్న ఆ నేతకు ఇప్పుడు ఎదురుగాలి రావడంతో ఆగమాగం అవుతున్నారన్న చర్చ సాగుతోంది. ఇద్దరు కార్పొరేటర్‌లు తప్ప మిగతావారందరూ హాజరయ్యారని తెలిసింది. అయితే హాజరైనవారిలో ఎంతమంది ఆయన వెంట నడుస్తారోనన్న చర్చ కూడా జరుగుతోంది.

మేం మందిమా...ఇవేం వ్యాఖ్యలు

ములుగు, భూపాలపల్లి, వరంగల్ పశ్చిమ, పరకాల బీఆర్‌ఎస్ అభ్యర్థులను అక్కడ జరిగిన బహిరంగసభల్లో జనం సాక్షిగా గెలిపించాలంటూ మంత్రి కేటీఆర్ ప్రకటనలు చేసి వారికి టికెట్ ఖాయమనే సంకేతాలు ఇచ్చారు. ఇదే తరహాలో వరంగల్ తూర్పులో జరిగిన బీఆర్‌ఎస్ బహిరంగసభలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు టికెట్ విషయంలో క్లారిటీ ఇవ్వకపోవడంతో రాజకీయవర్గాల్లో పెద్ద చర్చ సాగుతోంది. ఇదే సమయంలో 'మంది టికెట్లు ప్రకటిస్తారు...ఇంటొని టికెట్ ప్రకటించాల్సిన అవసరం లేదు'అంటూ ఓ చానల్‌తో మాట్లాడుతూ...ఎమ్మెల్యే నరేందర్ చేసిన వ్యాఖ్యలు గులాబీ పార్టీల్లో పెద్ద రచ్చకు దారి తీశాయి. అంటే మేం పార్టీ వాళ్లం కాదా... మేం గులాబీ ఇంటివాళ్లం కాదా... మందిమా... ఆయనొక్కడే ఇంటి వాడా? అంటూ టికెట్‌పై భరోసా ఉన్న నాయకులు లోలోన రగిలిపోతున్నారు. ఇప్పటికే పార్టీ ముఖ్యలంతా ఈ వ్యాఖ్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. టికెట్‌పై స్పష్టత లేని ఎమ్మెల్యే నరేందర్‌కు ఈ వ్యాఖ్యలు మరింత ప్రతిబంధకంగా మారాయని గులాబీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

గీసుకొండ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. వెంకటరమణ సోమవారం తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వడదెబ్బ తగిలి వచ్చే వారికి పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో సత్వర చికిత్సలు అందించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలను నాటారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎన్.గోపాల్‌రావు, డాక్టర్ అఖిల్, ఆయుష్ డాక్టర్ రేవతి, సీహెచ్‌ఓ బి. మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే వంచనగిరి సబ్‌సెంటర్ పరిధిలో నిర్వహించిన హెల్త్ క్యాంపును జిల్లా ప్రోగ్రాం అధికారి చల్లా మధుసూదన్ పరిశీలించారు. డాక్టర్ శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు సుజాత, మాధవి, హెచ్‌ఈ రఘు, లచ్చయ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కాశోజీ సెంటర్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యను వ్యాపారం చేస్తున్న పాఠశాలలపై చర్య తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ వాసంతిని నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో కనీస సౌకర్యాలు లేకుండా నడుపుతూ, ఇష్టానుసారంగా ఫీజులు, బుక్స్, యూనిఫామ్స్ పేర్లతో విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంచనగిరి సాయిరాం, జిల్లా సహాయ కార్యదర్శి అక్షిత అజయ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



వరంగల్: వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజులు (21, 22 తేదీలు) రాష్ట్ర స్థాయి జూడో పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాష్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పోటీలు జరుగనున్న దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పోటీలను జూడో అసోసియేషన్ అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ప్రారంభిస్తారన్నారు. తూర్పు ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారు కర్ణాటకలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఒయాసిస్ విద్యా సంస్థల చైర్మన్ పరంజ్యోతి ప్రారంభించారు.

మహిళలు, వృద్ధుల కోసం ట్రావెల్-9 టికెట్



ప్రయాణికురాలికి టీ-9 టికెట్ ఇస్తున్న కండక్టర్

హన్మకొండ : మహిళలు, వృద్ధుల కోసం టీఎస్ ఆర్టీసీ ట్రావెల్-9 టికెట్ ప్రవేశపెట్టిందని ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు, హనుమకొండ డిపో మేనేజర్ బాబు నాయక్ తెలిపారు. ఆదివారం నుంచి ఈ టికెట్ అమల్లోకి వచ్చిందని వారు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వినియోగించుకోవచ్చన్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ఈ టికెట్ చెల్లుబాటు అవుతుందని తెలిపారు. రూ.100 చెల్లించి టికెట్ తీసుకుని ఒక రోజులో 60 కిలో మీటర్లు ప్రయాణించొచ్చన్నారు. ప్రతి సర్వీస్‌లో కండక్టర్ వద్ద ఈ టికెట్ అందుబాటులో ఉంటుందన్నారు. దీని ద్వారా ప్రయాణికుడికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుందన్నారు. 60 ఏళ్లపై బడిన వృద్ధులు, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఐటీఐ..చదువులో మేటి!



ప్రభుత్వ ఐటీఐ కాజీపేట

సాంకేతిక విద్యకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వివిధ ఉద్యోగాలకు విస్తృత అవకాశాలు ఉండడంతో విద్యార్థులు ఐటీఐలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. కోర్సు కాల వ్యవధి తక్కువగా ఉండడం..పైగా కళాశాల్లోనే ఏర్పాటు చేసే ప్రాంగణ నియామకాల ద్వారా ఎంపికై జీవితంలో స్థిరపడే అవకాశం ఉండడంతో విద్యార్థులు ఈ విద్యను అభ్యసించడానికి ఇష్టపడుతున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో(ఐటీఐలు) 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. ఉన్నత విద్య అవకాశాలు, అప్రెంటీస్ ఎంపికల్లో పారదర్శకత వంటి చర్యలు ఐటీఐ విద్య బలోపేతానికి దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీఐ విద్యపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆయా ఐటీఐల్లో సీట్ల వివరాలు..

జయశంకర్ భూపాలపల్లి	84
ఏటూర్‌నాగారం (ఆదివాసీ పిల్లలకు)	63
మహబూబాబాద్	188
ములుగు రోడ్	678
హన్మకొండ	287
కాజీపేట	68

అర్హతలు..

- కోర్సుల్లో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదో తరగతి తప్పిన విద్యార్థులకు ఏడో తరగతి మార్కులు, ఎనిమిదో తరగతి టీసీ ఆధారంగా వెల్డర్ ట్రేడ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.
- 14 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వారు ప్రవేశాలకు అర్హులు.
- అధిక ఉత్తీర్ణతలున్న వారూ అర్హులే.

ఫీజు వివరాలు..

- ప్రభుత్వ ఐటీఐల్లో రూ. 60 కాషన్ డిపాజిట్ కింద చెల్లించాలి.
- ప్రైవేట్‌లో రూ. 7,200 ఫీజు అమల్లో ఉండగా గతేడాది రూ. 15,500 పెంచారు.

సాంకేతిక విద్యకు పెరుగుతున్న ఆదరణ

- పదో తరగతి అర్హతతో ప్రవేశాలు
- అప్రెంటీస్ నియామకాలు మెరుగు
- ఐటీఐ విద్యలో నాణ్యత, నైపుణ్యతకు పెద్దపీట

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. హన్మకొండ, కాజీపేట, ములుగు రోడ్, జయశంకర్ భూపాలపల్లి, ఏటూర్ నాగారం, మహబూబాబాద్‌లో ఉన్నాయి. వీటిలో 1368 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది కొత్త కోర్సులకు అవకాశం కల్పిస్తే కాజీపేట ఐటీఐ శాఖలో మరో 148 సీట్లు పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఉన్న 34 ప్రైవేట్ ఐటీఐల్లో దాదాపు 5 వేల సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లోని సీట్లకు ప్రవేశాలు నిర్వహిస్తారు.

అందుబాటులో ఉన్న కోర్సులు ..

పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ప్రస్తుతం 15 రకాల కోర్సులున్నాయి. ప్రభుత్వ విద్యలో రెండు సంవత్సరాల కోర్సుల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఇంజనీరింగ్ మెకానిక్, ఏవో కెమికల్, ఆర్‌అండ్‌ఏసీ, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మన్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ప్రధానమైనవి. ఏడాది కోర్సుల్లో డీజిల్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్, డ్రెస్‌మేకింగ్, కెమికల్ వంటి కోర్సులున్నాయి. ప్రైవేట్ కళాశాలలు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, కెమికల్, సివిల్ వంటి డిమాండ్ ఉన్న కోర్సులకే ప్రవేశాలు నిర్వహిస్తున్నాయి.

నైపుణ్యాలు.. అవకాశాలు..

ఆయా కళాశాలల్లో వృత్తి నైపుణ్యాలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ చేపడుతున్నారు. ఫలితంగా ప్రస్తుతం ప్రాంగణ నియామకాలు అధికంగా జరుగుతున్నాయి. గతేడాదిలో జాబ్‌మేళాల ద్వారా 500 మందికి ఉద్యోగాలు లభించాయి. క్యాడ్‌బరి, అపోలో టైర్స్, ఎల్‌అండ్‌టీ, ఓలమ్, ఆర్‌టెల్ కమ్యూనికేషన్, విశాఖ ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌కు చెందిన కంపెనీలు ఉద్యోగాలు కల్పించాయి.

ప్రభుత్వ ఐటీఐల్లో దరఖాస్తుల పరిశీలన..



ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ఆరంభమైంది. మరోపక్క దరఖాస్తుల పరిశీలన కూడా చురుగ్గా సాగుతోంది. ప్రభుత్వం సంస్కరణల ద్వారా విద్యలో నాణ్యత పెంచే చర్యలుపై దృష్టిసారించింది. భవిష్యత్తులో అభ్యర్థులకు అవకాశాలు పెరగనున్నాయి. జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలి.

– అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ కాజీపేట, ఐటీఐ

మూల మర్రితండా జీపీకి తాళం

- సర్పంచ్ కుమారుడి ఆగడాలపై ప్రజల ఆగ్రహం
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపాటు



గ్రామ పంచాయతీకి తాళం వేస్తున్న తండా వాసులు

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం మూలమర్రితండా గ్రామ పంచాయతీ కార్యాలయానికి తండా వాసులు సోమవారం తాళం వేశారు. అనంతరం సర్పంచ్ కుమారుడి ఆగడాలను నిరసిస్తూ తండాలోని ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ తేజావత్ జగినిలాల్ కుమారుడు భరత్‌కుమార్ ఆగడాలు రోజు రోజుకూ అంతులేకుండా పోతున్నాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి వీడీసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా చేస్తే తమ తండాలో మాత్రం సర్పంచ్ తనయుడు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి భరత్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు డీఈఈసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఈఈసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రవేశాలకు (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దు మీడియం) ఈనెల 21న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 4 నుంచి 10వ తరగతి వరకు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, టీసీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ పీహెచ్‌సీ ధ్రువపత్రాలతో హాజరై పరిశీలన చేయించుకోవాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



మొక్క నాటి నీరు పోస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో హరితోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లతో కలిసి సీఎండీ గోపాల్ రావు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారంతో తెలంగాణ వృక్షాలు, వనాలతో పచ్చదనంగా మారిందన్నారు. 9వ విడత హరిత హారంలో ప్రతీ ఉద్యోగి భాగస్వాములవ్వాలన్నారు. రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో నియంత్రించడానికి హరిత వనాలు అభివృద్ధి చేయడం ఎంతో అవసరమన్నారు. ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రంగా నిర్మించడమే మన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్ లాల్, మోహన్ రావు, కిషన్, ప్రభాకర్, రాజుచౌహాన్, కె.ఎన్.గుట్ట, రవీంద్రనాథ్, బీకంసింగ్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్‌తో సత్వర సేవలు

- కరీంనగర్ జోన్ ఇన్‌చార్జ్ కేశరాజు భానుకిరణ్



సంబురాల్లో భానుకిరణ్, అధికారులు, సిబ్బంది

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్, పార్సిల్, కొరియర్ సర్వీస్‌తో సత్వర సేవలు అందుతున్నాయని ఆర్టీసీ కరీంనగర్ జోన్ లాజిస్టిక్ ఇన్‌చార్జ్ కేశరాజు భానుకిరణ్ అన్నారు. లాజిస్టిక్ సేవలు ప్రారంభించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లోని లాజిస్టిక్, పార్సిల్ కౌంటర్‌లో ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటకలోని పలు ప్రాంతాలకు 440 కౌంటర్ల ద్వారా అతి తక్కువ ధరకు అతి వేగంగా పార్శిళ్లను చేరవేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా క్విక్ డెలివరీ పథకం ద్వారా కేవలం రూ.99కే మధ్యాహ్నం 12.00 గంటలలోపు బుక్ చేసిన పార్శిళ్లు రాత్రి 9.00 గంటల లోపు చేరేలా, రాత్రి 9.00 గంటలలోపు బుక్ చేసిన పార్శిళ్లను మరునాడు మధ్యాహ్నం 12.00 గంటలలోపు చేరవేస్తున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 53 కౌంటర్ల ద్వారా తమ సేవలు అందిస్తున్నామని, త్వరలో వరంగల్‌లో డోర్ డెలివరీ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. డోర్ డెలివరీకి ఆసక్తి ఉన్న ఏజెంట్లు సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా లాజిస్టిక్స్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది, హమాలీలను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.వేణుగోపాల్, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డి.శ్రవణ్ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, బి.సతీశ్ కుమార్. కౌంటర్ ఇన్‌చార్జి జి.రవి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- వర్ధన్నపేట మండల కోఆప్షన్ సభ్యుడి దుర్మరణం



పాషా (ఫైల్)

మామునూరు/వర్ధన్నపేట : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై లారీ.. బైక్‌ను ఢీకొనడంతో మండల కోఆప్షన్ సభ్యుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మామునూరు శివారు టీఎస్ఎస్పీ బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన ఎండీ.పాషా(72) మండల కోఆప్షన్ మెంబర్‌గా కొనసాగుతున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నూర్జాహబేగం ఐదేళ్ల క్రితం, పెద్ద కుమారుడు బాషమియా గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తుతం చిన్నకుమారుడు సలీంపాషా వరంగల్‌లో టైలర్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో పాషా ఆదివారం బైక్‌పై ఇల్లంద నుంచి వరంగల్‌లోని చిన్న కుమారుడు వద్దకు వచ్చాడు. సోమవారం ఉదయం ఇల్లందకు బయల్దేరాడు. మామునూరు టీఎస్ఎస్పీ బెటాలియన్ బంక్‌లో పెట్రోల్ పోసుకుని వెళ్తూ రహదారి క్రాస్‌చేస్తుండగా వరంగల్ నుంచి ఇల్లంద వైపునకు వెళ్తున్న లారీ.. బైక్‌ను ఢీకొంది. దీంతో పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్సైలు రాజేష్‌రెడ్డి, కృష్ణవేణి ఘటనా స్థలికి చేరుకుని లారీని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అరూరి రమేష్ ఎంజీఎం మార్చురీకి వద్దకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో యువకుడి మృతి



కిరణ్ (ఫైల్)

వర్ధన్నపేట: ఓ యువకుడు చిన్న వయస్సులోనే గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఘటన వర్ధన్నపేటలో చోటుచేసుకుంది. వర్ధన్నపేటకు చెందిన మేడ కిరణ్(30) బీటెక్ పూర్తి చేసి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కిరణ్‌ను వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 20న నిర్వహించే అన్ని పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ సోమవారం రాత్రి తెలిపారు. దూరవిద్య ఎమ్మెస్సీ మ్యాథ్స్ ఫైనల్ ఇయర్ పేపర్ కూడా వాయిదా వేశామని, ఆ పేపర్ పరీక్షను జూలై 3వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు.

శోభాయమానం.. సహస్ర కలశాభిషేకం

- సోమవారం ఉదయం నుంచి కార్యక్రమాలు ప్రారంభం
- శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దాస్యం



అమ్మవారికి కలశాభిషేకం చేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్ : చారిత్రక భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారికి సహస్రకలశాభిషేకం శోభాయమానంగా జరిగింది. ఉత్సవ కార్యక్రమాలు సోమవారం ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిర్మాల్యసేవలు, అమ్మవారికి నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, ఉత్సవానుజ్ఞప్రార్థన, గౌరి గణపతిపూజ, తదితర పూజలు నిర్వహించి కలశ స్థాపన చేశారు.

ఉత్సవాలను ప్రారంభించిన చీఫ్ విప్ వినయ్‌భాస్కర్..

ప్రభుత్వ చీఫ్‌విప్, హన్మకొండ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శాకాంబరీ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్, సారయ్యకు ఈఓ శేషు భారతి, భద్రకాళి శేషు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

శోభాయమానంగా సహస్రకలశాభిషేకం..

సహస్రకలశాభిషేకం మధ్యాహ్నం ప్రారంభమైంది. అగ్నిపురాణంలో చెప్పిన విధంగా వేదపండితులు నాలుగు వేదాల మూలమంత్రాలు పఠిస్తుండగా భక్తులు భద్రకాళి శరణం మమ అంటూ పలికారు. అనంతరం అమ్మవారికి అభిషేకం శోభాయమానంగా జరిగింది. కొమురవెల్లి దేవాలయం వేద పండితుడు వేలేటి సిద్ధరామశర్మ ద్వివేది, భద్రకాళి దేవాలయ ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, పార్నంది నర్సింహామూర్తి, సామవేద పండితుడు ప్రదీప్‌శర్మ, అర్చకులు, భద్రకాళి సాంగ అగమ వేద పాఠశాల విద్యార్థులు అభిషేకకార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, వరంగల్‌కు చెందిన బాసాని విశ్వప్రకాశ్, శోభ దంపతులు సహస్రకళశాభిషేకం దాతలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని కాళీక్రమంలో అలంకరించారు. రాత్రి కామేశ్వరీనిత్యాక్రమంలో అవరణార్చనలు, సాయంతనపూజ, నీరాజనమంత్రపుష్పం,తీర్థప్రసాదవితరణ జరిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.5 లక్షల విలువైన నగలు, రూ.75వేల నగదు అపహరణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ, క్లూస్‌టీమ్



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సీఐ

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో దుండగులు చొరబడి రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరుగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు పొన్నం లింగం, శ్రీలత దంపతుల కథనం ప్రకారం.. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహం జరిగింది. ఆరు నెలల నుంచి కుమారుడు, కోడలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. లింగం, శ్రీలత స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉంటున్నారు. అయితే శ్రీలత అమ్మగారి ఊరు ఐనవోలు మండలం సింగారం గ్రామానికి దంపతులిద్దరూ శనివారం వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఆదివారం రాత్రి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.75వేల నగదును అపహరించారు. సోమవారం ఉదయం దంపతులు ఇంటికి వచ్చేసరికి గేటుపక్కన ఉన్న ఇనుపరాడ్ వంగి ఉండడం, పూలకుండి కింద పడి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూసేసరికి ఇంటి వెనుక తలుపు తెరిచి ఉంది. బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న 8 బంగారు ఉంగరాలు, ఒక బంగారు గొలుసు, కమ్మలు, పుస్తె మొత్తం 8 తులాల బంగారు నగలు, వెండి పట్టగొలుసులు, మట్టెలు, బ్రాస్‌లెట్ మొత్తం 20 తులాల వెండి ఆభరణాలు, రూ.75వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ ఎ.రాఘవేందర్, ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్ అక్కడకు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఘటనా స్థలిని పరిశీలించిన ఏసీపీ

విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ ఘటనా స్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీమ్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు. బాధితుడు లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే..

స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, ఏసీపీ కార్యాలయానికి సమీప కాలనీలోని ఇంటిలో చోరీ జరగడంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగలు హల్‌చల్ చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు రాత్రివేళల్లో గస్తీని, పెట్రోలింగ్‌ను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.